# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి

## రాష్ట్ర విద్యుచ్ఛక్తి విడుదల కేంద్రముచే ఫీజులు మరియు చార్జీల విధింపు మరియు వసూలు

## 2006 లో 1వ నిబంధన

## (ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజపత్రం రెండవ భాగంలో 27.07.2006న ప్రచురించబడినది)

__ఉపోద్ఘాతము:__

రాష్ట్ర ప్రభుత్వము, రాష్ట్ర విద్యుచ్ఛక్తి విడుదల కేంద్రము (ఎస్.ఎల్.డి.సి.) ను స్థాపించవలెనని కేంద్ర విద్యుత్ చట్టము, 2003 లోని 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) లో నిబంధన ఉన్నది. సదరు ఎస్.ఎల్.డి.సి. ని రాష్ట్ర చట్టము క్రింద ఏర్పాటు చేసిన ప్రభుత్వ కంపెనీగాని, సంస్థ గాని, కార్పొరేషను గాని నిర్వహించాలని మరియు అట్టి కంపెనీ గాని సంస్థ గాని కార్పొరేషనును రాష్ట్ర ప్రభుత్వము ప్రకటించే వరకూ రాష్ట్ర ప్రసారణ సంస్థ నిర్వహించాలని 31వ పరిచ్ఛేధపు ఉప- పరిచ్ఛేధము (2) లో నిబంధన ఉన్నది. ప్రస్తుత ఎస్.ఎల్.డి.సి., రాష్ట్ర విద్యుచ్ఛక్తి విడుదల కేంద్రముగా కొనసాగాలని, రాష్ట్ర ప్రభుత్వము ప్రభుత్వ కంపెనీని లేక ఏదేని సంస్థను లేక కార్పొరేషనును స్థాపించేవరకూ దానిని రాష్ట్ర ప్రసారణ సంస్థ అయినటువంటి ఏ.పి.ట్రాన్స్ కో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము జి.ఓ.ఎమ్ఎస్.నం.8, తేదీ 17.1.2004 ద్వారా ప్రకటించడమైనది.

రాష్ట్ర మండలిచే నిర్దేశించబడినట్లుగా రాష్ట్రము లోపల విద్యుత్ ప్రసారణలో నిమగ్నమైన ఉత్పాదక కంపెనీలు మరియు అనుమతిదారుల నుండి ఫీజులను, చార్జీలను విధించి వసూలు చేయుట కొరకు చట్టములోని 32 (3) పరిచ్ఛేధములో నిబంధన ఉన్నది.

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 యొక్క పరిచ్ఛేధములో 32 (3) మరియు 181 (2) (జి) ల ద్వారా లభించిన అధికారములను మరియు ఈ విషయములో వీలు కలిగించు అన్ని ఇతర అధికారములను వినియోగిస్తూ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ నిబంధనను జారీచేయడమైనది:--

## భాగము – 1

## ప్రారంభిక

### 1. సంగ్రహ నామము, వర్తింపు మరియు ప్రారంభము:

(i) ఈ నిబంధనను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (రాష్ట్ర విద్యుచ్ఛక్తి విడుదల కేంద్రముచే ఫీజులు, చార్జీల విధింపు మరియు వసూలు) నిబంధన, 2006 అని పిలువవచ్చును.

(ii) ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లోపల విద్యుత్ ప్రసారణ చేయుచున్న ఉత్పాదక కంపెనీలు మరియు అనుమతిదారులకు అందరికీ వర్తించును.

(iii) ఈ నిబంధన రాష్ట్రం లోపల ప్రసారణ నెట్ వర్క్కు అనుసంధానము చేయబడని ఉత్పాదకులు, ప్రతినిధులు (ఫ్రాంచైజీస్), మొదలైనవారికి వర్తించదు.

(iv) ఈ నిబంధన ఏప్రియల్ 1, 2007 తేదీన అమలులోనికి వచ్చును.

### 2. నిర్వచనములు మరియు అర్థాన్వయము:

(i) ఈ నిబంధనలో సందర్భమును బట్టి వేరే అర్ధము ఉన్ననే తప్ప;

(ఏ) "చట్టము" అనగా కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లో 6వ చట్టము) అని అర్ధము;

(బి) "మండలి" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్ధము;

(సి) "అనుమతి" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లోపల విద్యుత్ ప్రసారణకు, పంపిణీకి మరియు విద్యుత్ వ్యాపారస్తునిగా విద్యుత్ వ్యాపారమును చేయుటకు చట్టము యొక్క 14వ పరిచ్ఛేధము క్రింద మంజూరైన అనుమతి అని అర్ధము;

(డి) "అనుమతిదారుడు" అనగా చట్టము యొక్క 14వ పరిచ్ఛేధము క్రింద అనుమతి మంజూరైన వ్యక్తి అని అర్ధము;

(ఇ) "రాష్ట్రము" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అని అర్ధము;

(ఎఫ్) "ఎస్.ఎల్.డి.సి. " లేక "రాష్ట్ర విద్యుచ్ఛక్తి విడుదల కేంద్రము" అనగా చట్టము యొక్క 31వ పరిచ్ఛేధపు ఉప- పరిచ్ఛేధము(1) క్రింద

స్థాపించబడిన కేంద్రము అని అర్థము;

(జి) "వాడకందారుడు" అనగా విద్యుత్తు అమ్మకము / సేకరణ నిమిత్తము రాష్ట్రం లోపల ప్రసారణ నెట్ వర్క్ను ఉపయోగించుకొను ఉత్పాదక కంపెనీలు, సందర్భానుసారంగా, పంపిణీ అనుమతిదారులు లేక వ్యాపార అనుమతిదారులు అని అర్థము.

(ii) ఈ నిబంధనలో ఉపయోగించబడి, నిర్వచించబడని పదములు, పదబంధములు చట్టములో అవి నిర్వచించబడిన యెడల చట్టములో వాటికి ఉన్న అర్థమునే కలిగి యుండును.

(iii) ఈ నిబంధన క్రింద వ్యవహారములన్నీ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (కార్యనిర్వహణ) నిబంధనల ద్వారా పరిశీలించబడును.

**3. వాడకందారుల రిజిస్ట్రేషన్ మరియు రిజిస్ట్రేషను రుసుము:**

3.1 రాష్ట్రంలోపల ప్రసారణ నెట్ వర్క్తో ఉత్పాదక స్టేషన్ల సంధానమును కోరే ఒక్కొక్క ఉత్పాదక స్టేషనుకు (స్థాపించిన సామర్థ్యముతో సంబంధం లేకుండా) రిజిస్ట్రేషను ఫీజుగా రూ.1000/- చెల్లించి ఎస్.ఎల్.డి.సి. తో, వారి వారి ఉత్పాదక స్టేషన్లను రిజిస్టరు చేసుకొనవలెను.

3.2 రాష్ట్ర గ్రిడ్ తో సంధానము చేయబడిన లేక సంధానము కాదలచిన ప్రస్తుత ఉత్పాదక కంపెనీలు, **పంపిణీ** అనుమతిదారులు మరియు వ్యాపార అనుమతిదారులు, ఈ నిబంధన అమలులోనికి వచ్చిన నెల రోజులలోగా పైన తెలిపిన ఫీజుతో పాటు దరఖాస్తును దాఖలు చేయుట ద్వారా ఎస్.ఎల్.డి.సి. తో తమకు తాముగా రిజిస్టరు చేసుకొనవలెను.

3.3 ఎస్.ఎల్.డి.సి. దరఖాస్తును పరిశీలించిన మీదట, దరఖాస్తులో తెలిపిన సమాచారము పూర్తిగాను, సరియైనదిగానూ ఉన్నదని సంతృప్తి చెందిన పిమ్మట, దరఖాస్తుదారుకు తమ అంగీకారమును తెలుపుతూ తమ రికార్డులలో దరఖాస్తును రిజిస్టరు చేయవలెను. దాని నకలును మండలికి దాఖలు చేయవలెను.

3.4 ఎస్.ఎల్.డి.సి. రాష్ట్రం లోపల ప్రసారణ నెట్ వర్క్ తో సంధానము కాబడి దానిచే

పర్యవేక్షించబడుతున్న/సేవ చేయబడుతున్న ఉత్పాదక కంపెనీలు మరియు అనుమతిదారులకు సంబంధించిన ఏకీకృత సమాచారమును, ప్రతి సంవత్సరము నవంబరు 15వ తేదీ నాటికి మండలికి సమర్పించవలెను.

## 4. వార్షిక ఫీజు మరియు నిర్వహణ ఛార్జీలు:

4.1 వాడకందారులు, మెగావాట్లలో చేసిన విద్యుత్తు ప్రసారణపై విధించదగు వార్షిక ఫీజును మరియు నెలవారీ నిర్వహణ ఛార్జీలను, మె.వా. ఒక్కంటికి కనీస ఛార్జీలకు లోబడి, ఎస్.ఎల్.డి.సి.కి చెల్లించవలెను:

అయితే, పైన తెలిపిన ఫీజు మరియు ఛార్జీల బిల్లింగు మరియు వసూలు నిమిత్తము మెగా వాట్ లో భాగమును పూర్తి మెగావాట్ గా భావించవలెను:

అంతేకాక, నెలలో భాగమును పూర్తి నెలగా సవరిస్తూ కనీసం ఒక నెలకు నిర్వహణ ఛార్జీలను విధించవలెను.

4.2 కేంద్రము (ఎస్.ఎల్.డి.సి.)ను స్థాపించుటకు అవసరమైన మూలధన పెట్టుబడిని లెక్కలోనికి తీసుకొని మండలి, వార్షిక ఫీజును నిర్ధారించవలెను. ఎస్.ఎల్.డి.సి. ని అభివృద్ధి పరచుటకు మరియు/ లేక నవీకరణ కొరకు అవసరమైన పెట్టుబడులకు గాను ఎస్.ఎల్.డి.సి. మండలికి చేసిన దాఖలు ఆధారంగా ఫీజు సవరించబడును.

4.3 సంవత్సరంలోని పెట్టుబడులపై, అసలు తిరిగి చెల్లింపు మరియు వడ్డీ చెల్లింపు, గతంలోని పెట్టుబడులపై బాకీ ఉన్న పెట్టుబడి ఖర్చు, వీటికొరకైన పెట్టుబడి ఖర్చు ఆధారంగా వార్షిక ఫీజును నిర్ధారించవలెను.

4.4 వార్షిక ఫీజును ఈ విధంగా లెక్కించవలెను:

$$\text{వార్షిక ఎస్.ఎల్.డి.సి. ఫీజు (రూ. / మె.వా. / సంవత్సరానికి)} = \frac{\text{పెట్టుబడి ఖర్చు (సి.సి.) (రూ.లలో)}}{\text{మొత్తము ఉత్పాదన సామర్ధ్యం (మె.వా.)}}$$

ఇందులో,

సంవత్సరంలో పెట్టుబడి ఖర్చు (సి.సి.) ని ఈ విధంగా లెక్కించవలెను:

$$\text{సి.సి. (రూ.లలో)} = \text{పెట్టుబడి} \times \text{ఆర్}/(1-1/(1+\text{ఆర్})^{\text{టి}})$$

పెట్టుబడి = సంవత్సరంలో వాస్తవంగా పెట్టిన పెట్టుబడి + గతంలోని పెట్టుబడుల బాకీ విలువ

**ఆర్** = అప్పు తెచ్చిన పెట్టుబడిపై వాస్తవ వడ్డీ రేటు లేక బ్యాంకు రేటుపై 150%, ఏది తక్కువ అయితే అది

టి = పెట్టుబడిని తిరిగి వసూలు చేయుటకు ప్రతిపాదించిన సంవత్సరముల సంఖ్య; ఇది సాఫ్ట్‌వేర్ కొరకు 5 సంవత్సరములు, ఇతర పెట్టుబడుల కొరకు 10 సంవత్సరములు.

4.5 ఎస్.ఎల్.డి.సి. చేసిన దాఖలు ఆధారంగా సంవత్సరానికి నిర్వహణ చార్జీలను నిర్ణయించవలెను. ఇందులో ఈ క్రిందివి చేరియుండును:

(ఏ) సిబ్బంది ఖర్చు;

(బి) పరిపాలన మరియు సాధారణ ఛార్జీలు;

(సి) మరమ్మత్తులు మరియు నిర్వహణ ఖర్చులు; మరియు

(డి) మండలి సముచితమని భావించు ఇతర సంబంధిత ఖర్చులు మరియు వ్యయములు.

4.5.1 <u>సిబ్బంది ఖర్చు:</u>

సంవత్సరానికి పరిగణనలోనికి తీసుకొనవలసిన సిబ్బంది ఖర్చు, ఆమోదించబడిన సిబ్బంది ప్రణాళిక ప్రకారం గాని లేక వాస్తవ సిబ్బంది ఖర్చు, ఇందులో ఏది తక్కువ అయితే, దాని ప్రకారం ఉండవలెను. ముందు చర్యగా, ఎస్.ఎల్.డి.సి. ఈ నిబంధన ప్రకటించబడిన తేదీ నుండి మూడు నెలల లోపల సిబ్బంది ప్రణాళికను దాఖలు చేయవలెను. ఇందులోని వివరములను పరిశీలించినమీదట, మండలి సిబ్బంది ప్రణాళికను ఆమోదించవలెను. ఈ ఆమోదము కేవలము నిర్వహణ చార్జీల ద్వారా ఖర్చును వసూలుచేయుటకు మాత్రమే, ఇతర ప్రయోజనముల కొరకు కాదు.

4.5.2 పరిపాలన మరియు సాధారణ వ్యయములు మరియు మరమ్మత్తులు & నిర్వహణ వ్యయములు:

మొదటి నియంత్రణ వ్యవధికి ఈ వ్యయములను, ఎస్.ఎల్.డి.సి. దాఖలు చేయగా మండలి ఆమోదించిన సమాచారము ఆధారంగా నిర్ణయించవలెను. అటుపిమ్మట, మండలి నిర్ధారించునట్టి ప్రమాణముల ప్రకారము నిర్ణయించవలెను.

4.5.3 ఇతర వ్యయములు:

పెట్టుబడి ఖర్చు, సిబ్బంది ఖర్చు, పరిపాలన మరియు సాధారణ వ్యయములు లేక మరమ్మత్తులు & నిర్వహణ వ్యయముల లోనికి రాని ఇతర వ్యయములన్నీ ఈ కేటగిరీ వ్యయములలోనికి వచ్చును. ఎస్.ఎల్.డి.సి. ఛార్జీల నిర్ణయము కొరకు ప్రతిపాదనలు పంపు సమయములో ఇట్టి వ్యయముల వివరములను దాఖలు చేయవలెను.

4.6 మెగా వాట్ ఒక్కంటికి నెలవారీ నిర్వహణ ఛార్జీలను ఈ క్రింది విధముగా లెక్కించవలెను:

$$\text{నిర్వహణ ఛార్జీలు (రూ. / మె.వా. / నెలకు)} = \frac{\text{వార్షిక నిర్వహణ ఛార్జీలు}}{\text{మొత్తము ఉత్పాదన సామర్ధ్యము (మె.వా.)} \times 12}$$

4.7 ఎస్.ఎల్.డి.సి. ని వినియోగించుకొనుటలో వ్యత్యాసముల కారణంగా సంవత్సరానికి నిర్ణయించిన ఫీజు మరియు ఛార్జీలపై పెట్టుబడి ఖర్చు మరియు నిర్వహణ ఛార్జీల వసూలులో వ్యత్యాసములను, తదుపరి నియంత్రణ వ్యవధిలో లేక వ్యత్యాసములు ఎక్కువగా ఉండి సర్దుబాటు తప్పనిసరి అని మండలి భావించినట్లయితే తదుపరి నియంత్రణ వ్యవధి కంటే ముందుగానే, వ్యత్యాసములకు సంబంధించిన సంవత్సరములలో అప్పు తెచ్చిన సగటు రేట్లపై ఆర్థిక ఖర్చుతో పాటుగా సర్దుబాటుచేయవలెను.

**5. ఎస్.ఎల్.డి.సి. ఫీజు మరియు చార్జీల వసూలు:**

5.1 ఎస్.ఎల్.డి.సి. చార్జీలను (వార్షిక ఫీజు మరియు నిర్వహణ ఛార్జీలు) ప్రసారణ అనుమతిదారునితో ఉన్న ఒప్పందము లేక ఏర్పాటు ప్రకారం రాష్ట్రం లోపల ప్రసారణ నెట్ వర్కును వినియోగించుకొనుచున్న ఉత్పాదక కంపెనీలు (క్యాప్టివ్ ఉత్పాదక ప్లాంట్లతో సహా) పంపిణీ అనుమతిదారులు మరియు వ్యాపార

అనుమతిదారులు తమ ఒప్పందపు సామర్థ్యమునకు దామాషా ప్రకారం చెల్లించవలెను.

5.2 ఫీజు :

వాడకందార్లందరూ మండలి నిర్దేశించిన వార్షిక ఫీజును 2007-08 నుండి ప్రారంభమయ్యే ప్రతి ఆర్థిక సంవత్సరానికీ, ఏప్రియల్ 10 మరియు అక్టోబరు 10 తేదీలలో రెండు సమాన వాయిదాలలో ముందుగా చెల్లించవలెను:

అయితే, రాష్ట్రం లోపల ప్రసారణ వ్యవస్థను ఉపయోగించుకొనుట వరుసగా ఆ సంవత్సరంలో ఏప్రియల్ 10 లేక అక్టోబరు 10వ తేదీ తరువాత ప్రారంభమయిన సందర్భంలో, ఆ సంవత్సరంలో సెప్టెంబరు 30వ తేదీ వరకూ చెల్లించవలసిన ఫీజును మరియు తదుపరి సంవత్సరం మార్చి 31వ తేదీవరకూ చెల్లించవలసిన ఫీజును రాష్ట్రం లోపల ప్రసారణ ప్రారంభమునకు ముందు చెల్లించవలసియుండును.

5.3 నిర్వహణ ఛార్జీలు:

ఎస్.ఎల్.డి.సి. యొక్క నిర్వహణ చార్జీలను నెల నెలా చెల్లించవలెను.

5.4 ఫీజును గాని, ఛార్జీలను గాని గడువు తేదీ (ల) లోపల చెల్లించనియెడల, చెల్లించని మొత్తములపై నెలకు 2% చొప్పున సర్ ఛార్జీ విధించబడును.

5.5 నిర్వహణ చార్జీల చెల్లింపుకు హామీగా రెండునెలల నిర్వహణ చార్జీలకు సమానమైన మొత్తమును ప్రతివాడకందారూ ముందుగా డిపాజిటు చేయవలెను.

**6. ఫీజు మరియు చార్జీల నిర్ధారణ కొరకు దరఖాస్తు:**

6.1 ఎస్.ఎల్.డి.సి. రాబోవు నియంత్రణ వ్యవధికి ఫీజు మరియు ఛార్జీల నిర్ధారణ కొరకు, నియంత్రణ వ్యవధిలోని మొదటి సంవత్సరమునకు ముందు నవంబరు 30వ తేదీ లోగా దరఖాస్తును / అర్జీని మండలికి దాఖలు చేయవలెను. దీనికి ప్రతిపాదనలతో పాటుగా ప్రస్తుత ఆమోదిత ఫీజు మరియు చార్జీల వివరములను జతపరచవలెను.

6.2 నియంత్రణ వ్యవధి సాధారణంగా 5 సంవత్సరములు ఉండును. అయితే, మొదటి నియంత్రణ వ్యవధి మాత్రము 2007-08 నుండి 2008-09 వరకూ

రెండు సంవత్సరములు. 2009-10 నుండి తదుపరి నియంత్రణ వ్యవధులన్నీ 5 సంవత్సరములు ఉండవలెను.

6.3 ఎస్.ఎల్.డి.సి. ప్రతి నియంత్రణ వ్యవధి కొరకు పెట్టుబడి ప్రణాళికను, నియంత్రణ వ్యవధి ప్రారంభమునకు 120 రోజుల ముందుగా సమర్పించవలెను. పెట్టుబడి ప్రణాళికలో, ఇతర విషయములతో పాటుగా పెట్టుబడి కొరకు నిధుల వనరులను చేర్చవలెను.

6.4 ఫీజు మరియు చార్జీల నిర్ధారణ కొరకైన దరఖాస్తును, లబ్ధిదారులందరికీ సులువుగా అందుబాటులో ఉండే విధంగా ఎస్.ఎల్.డి.సి. వెబ్ సైటులో డౌన్ లోడు చేసుకొనే విధంగా ఉంచవలెను.

## 7. అకౌంట్ల వేర్పాటు:

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ప్రసారణ ట్యారిఫ్ నిర్ధారణ కొరకు నిబంధనలు మరియు షరతులు) నిబంధన, 2005 (2005 లో 5వ నిబంధన) లోని 5వ ఖండములో నిర్దేశించినట్లుగా, ఆంధ్రప్రదేశ్ ప్రసారణ కార్పొరేషను లి. (ఏ.పి. ట్రాన్స్‌కో), మరియు ఎస్.ఎల్.డి.సి. కార్యకలాపములకు వేరు వేరుగా అకౌంట్లను నిర్వహించవలెను. అకౌంట్లను వేరు చేసే వరకూ సంబంధిత వివరములతో మండలికి సమర్పించే కేటాయింపు వివరణ ఆధారంగా తన ఖర్చులను వేరుచేయవలెను.

## 8. ఫీజు మరియు చార్జీల వర్తింపు:

8.1 మండలి నిర్ధారించిన ఎస్.ఎల్.డి.సి. ఫీజు మరియు ఛార్జీలు, ఎస్.ఎల్.డి.సి. చేసిన దరఖాస్తుపై మండలి ఉత్తరువులో నిర్దేశించిన తేదీ నుండి అమలులోనికి వచ్చును.

8.2 మండలి ఆ విధంగా నిర్ధారించిన ఎస్.ఎల్.డి.సి. ఫీజు మరియు ఛార్జీలు పైన తెలిపిన ఉత్తరువులో మండలి నిర్దేశించిన వ్యవధి వరకూ చెల్లునవిగా ఉండును.

## 9. సమాచారమును ఉపయోగించుకొనుట:

ఎస్.ఎల్.డి.సి. సమర్పించిన సమాచారమును ప్రచురించుట లేక మండలి వెబ్ సైటులో ఉంచుట మరియు/లేక ఆ సమాచారమును ఎస్.ఎల్.డి.సి. వెబ్ సైటులో /ఏ.పి.ట్రాన్ కో వెబ్ సైటులో ఉంచుటకు ఎస్.ఎల్.డి.సి.ని ఆదేశించుటతో సహా

తాను సబబని తలచు విధంగా సమాచారమును వినియోగించుకొనుటకు మండలి హక్కు కలిగి యుండును.

**10. సవరించుటకు అధికారము:**

మండలి, ఎప్పుడైననూ, ఈ నిబంధనను తగువిధంగా సవరించవచ్చును.

**11. మినహాయింపులు:**

11.1 న్యాయము చేయుటలో లేక మండలి వ్యవహార దుర్వినియోగమును నిరోధించుటలో అవసరమైనట్టి ఉత్తరువులను చేయుటకు మండలికి ఉన్న స్వయంసిద్ధమైన అధికారమును ఈ నిబంధనలో ఉన్నదేదియూ పరిమితము చేయునదిగా లేక ప్రభావితము చేయునదిగా భావించరాదు.

11.2 ఏదేని విషయము లేక విషయముల తరగతికి సంబంధించిన ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యానూ మరియు వ్రాతపూర్వకముగా నమోదు చేయదగు కారణములను బట్టి, అట్టి విషయము లేక విషయముల తరగతిని వ్యవహరించుట కొరకు అవసరము లేక ఉపయుక్తమని మండలి భావించినయెడల, కేంద్ర విద్యుత్ చట్టము, 2003 యొక్క నిబంధనలకు అనుగుణముగానున్న, అయితే, ఈ నిబంధనకు అనుగుణముగా లేని, ఒక కార్య విధానమును అనుసరించుటకు ఈ నిబంధనలోనున్నదేదియు మండలిని ఆటంకపరచదు.

11.3 కేంద్ర విద్యుత్ చట్టము, 2003 క్రింద ఏదేని విషయమును వ్యవహరించుటకై లేక ఏదేని అధికారమును వినియోగించుటకై ఎట్టి నిబంధన చేయబడనప్పుడు, ఈ నిబంధనలోనున్నదేదియు, స్పష్టంగా వ్యక్తపరుస్తూ గాని, అంతర్నిహితంగా గాని మండలిని ఆటంకపరచదు. అట్టి విషయములు, అధికారములు మరియు విధుల విషయంలో మండలి తాను సబబని భావించునట్టి రీతిలో వ్యవహరించవచ్చును.

**(మండలి ఉత్తరువు మేరకు జారీ చేయబడినది)**

**హైదరాబాదు** — **ఎస్. సూర్యప్రకాశరావు**

**తేదీ. 26.7.2006** — **కార్యదర్శి**

# అనుబంధము – ఏ

## (ఉత్పాదక కంపెనీల కొరకు)

## రాష్ట్రంలోపల ప్రసారణ వ్యవస్థ వాడకందారుగా ఎస్.ఎల్.డి.సి. తో రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు

| | | |
|---|---|---|
| ఉత్పాదక కంపెనీ పేరు | : | |
| ఉత్పాదక కంపెనీ చిరునామా | : | |
| ఉత్పాదక కేంద్రము ఉన్న ప్రాంతము | : | |
| గ్రిడ్ తో సంధానమగు స్థానము (స్విచ్ యార్డు లే-అవుటును జతపరచవలెను) | : | |
| స్థాపించిన మొత్తము సామర్ధ్యము | : | |
| ఉత్పాదక కేంద్రము యొక్క సి.ఓ.డి. | : | |
| విద్యుత్తును వినియోగించే స్వభావము | : | అనుమతిదారులకు సరఫరా/ ఇతర వ్యక్తి/సంస్థలకు వీలింగు / క్యాప్టివ్ వినియోగము కొరకు వీలింగు |
| ……… తేదీ నాటికి ఒప్పందపు ప్రసారణ సామర్ధ్యము (అనుమతిదారుల వివరములను జతపరచవలెను) | : | |
| అనుమతిదారుల సరఫరా కొరకు | : | |

ఇతర సంస్థలకు వీలింగు కొరకు :

క్యాప్టివ్ వినియోగము కొరకు వీలింగు :

అనుమతిదారులకు సరఫరా కొరకు ఒప్పందపు వ్యవధి :

ఎస్.ఎల్.డి.సి. కి డేటా ప్రసారము కొరకు స్థాపించిన ప్రసార వ్యవస్థ వివరములు :

ఎస్.ఎల్.డి.సి. తో ప్రసారము కొరకు కంట్రోలు రూము యొక్క స్థాపన ఇన్-చార్జి :

రిజిస్ట్రేషను ఫీజును చెల్లించిన వివరములు :

సమర్థవంతమైన గ్రిడ్ నిర్వహణకు సహాయపడుటకు ఉపయోగకరమైన ఏదేని ఇతర సమాచారము :

అధీకృతుడైన అధికారి సంతకము

## అనుబంధము – బి

## (పంపిణీ అనుమతిదారులు /విద్యుత్ వ్యాపారుల కొరకు)

## రాష్ట్రంలోపల ప్రసారణ వ్యవస్థ వాడకందారుగా ఎస్.ఎల్.డి.సి. తో రిజిస్ట్రేషన్ కొరకు

## దరఖాస్తు

| | |
|---|---|
| పంపిణీ అనుమతిదారు/విద్యుత్ వ్యాపారి పేరు | : |
| పంపిణీ అనుమతిదారు/విద్యుత్ వ్యాపారి చిరునామా | : |
| గ్రిడ్ తో సంధానమగు స్థానము (స్థలము, సామర్ధ్యము, బేల సంఖ్య, లైను పొడవు, లైను విధము, ప్రారంభ తేదీ మొదలగు వాటితో సహా ఒల్టేజీ వారీగా గ్రిడ్ సబ్-స్టేషన్లు/లైన్లు జాబితాను జతపరచవలెను) | : |
| మొత్తము సామర్ధ్యము (అందించగల గరిష్ట డిమాండు) | : |
| ప్రసారణ అనుమతిదారులనుండి ఒప్పందము పొందిన ప్రసారణ సామర్ధ్యము (ప్రసారణ అనుమతిదారుల వివరములతో జాబితాను జతపరచవలెను) | : |
| ఓపెన్ యాక్సెస్ వినియోగదారులకు ఒప్పందపు సామర్ధ్యము (వినియోగదారుల వివరములతో జాబితాను జతపరచవలెను) | : |
| ఎస్.ఎల్.డి.సి. కి డేటా ప్రసారము కొరకు అందుబాటులో ఉన్న ప్రసార వ్యవస్థ వివరములు (సబ్-స్టేషను వారీగా వివరములను జతపరచవలెను) | : |

గ్రిడ్ సబ్-స్టేషన్ల నిర్వహణ కొరకు బాధ్యులైన సిబ్బంది హోదా (సబ్-స్టేషను వారీగా వివరములను జతపరచవలెను) :

రిజిస్ట్రేషను ఫీజును చెల్లించిన వివరములు :

సమర్ధవంతమైన గ్రిడ్ నిర్వహణకు సహాయ పడుటకు ఉపయోగకరమైన ఇతర సమాచారము :

అధీకృత అధికారి సంతకము

**గమనిక**: నిబంధన యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజా సౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదము మాత్రమే. అధికారిక పాఠం కాదు.